# విడియోశాస్త్రిగారు

-- భారతి భావరాజు

1980వ దశాబ్దంలో మావారికి "విడియోశాస్త్రి" అనే బిరుదు ఉండేది. బిరుదు అంటే సరిపోదు, అది ఎవరిచ్చారు, ఎందుకిచ్చారో కూడా చెప్పాలి మీకందరికి. ఆ రోజులలో విడియో కెమెరా చాలా కొద్దిమంది దగ్గరే ఉండేది. వారిలో మావారొకరు. సుమారు 20పౌన్ల బరువు, రెండు భాగాలుగా వున్న ఈ కెమెరాను రెండు బుజాలమీద తగిలించుకొని ఎంతో గర్వంగా మా అమ్మాయిలిద్దరి ఆటపాటలేకాక, మాఅమ్మాయిలచేత ఇంటికివచ్చిన బంధుమిత్రులందరినీ ఇంటర్వ్యూ చేయించి, విడియోలని మళ్ళా మళ్ళా చూపించేవారు. నిజం చెప్పాలంటే ఈనాటికి అవే విడియోలు డి.వి.డి.లుగా మార్చుకొని అందరం చూసి సంతోషిస్తున్నాం. అది వేరే సంగతి.

తరువాత మాస్నేహితులలో ఒకరు వాళ్ళ అమ్మాయి పెళ్ళికి విడియోతీస్తారా అని అడగడంతో మావారు ఆనందంతో పొంగిపోయారు. కానీ ఎప్పుడైతే పెళ్ళికుమార్తె తండ్రి మావారితో మీరు తీయబోయే విడియోయే చిరకాల జ్ఞాపకంగా మిగల బోతుందని, (ప్రొఫెషనల్) విడియోగ్రాఫర్ గా మిగతపెళ్ళివారికి పరిచయం చెయ్యడంతో సందిఘ్నంలో పడి, కొంత ఉత్సాహం తగ్గిందనిపించింది. "చాలా బాగాతీశారండీ" అని పెళ్ళికూతురి తండ్రి కొన్నాళ్ళ తరువాత చెప్పగానే మావారికి ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. అప్పటినుంచి ఆనోట, ఈనోట మావారు విడియో తీస్తారని తెలిసింది మిగత బంధుమిత్రులకి. ఒకరింట్లో ఉపనయనం, ఇంకొకరింట్లో నిశ్చితార్థం, మరొకరింట్లో సత్యనారాయణవ్రతం విడియోలు తీసేసరికి, కొందరు మావారికి "విడియోశాస్త్రి"గారనే బిరుదిచ్చారు. ప్రొఫెషనల్ విడియోలు తీశేవారు తక్కువ ఆరోజులలో. ఒకసారి ఏవరో ఫోనులో మీరు విడియో బాగాతీస్తారని ఎందరోచెప్పగా విన్నాం, మా అమ్మాయి భరతనాట్య ఆరంగేట్రం విడియో తీయవలసిందని కోరారు. ఇంకేం రెండు భుజాలమీద కెమెరా ఎక్కించుకుని హుందాగా బయలుదేరారు మావారు. అలాగే తెలుగుసభలలో అందరికన్న ముందుగా కెమేరా పెట్టుకొని ప్రోగ్రామంతా తీస్తుండేవారు. అల్లాగే సంగీతకచేరీలు. నిజంచెప్పాలంటే మావారు "విడియోశాస్త్రి"గా ప్రేక్షకులందరికన్నా ముందు వరసలో కూర్చొని మన్ననలు, ఆతిథ్యం (కాఫీలు, ఫలహారాలు వగైరా), అందుకొన్నారు ఆరోజులలో.

1990 దశాబ్దం వచ్చేసరికి నాజూకైన విడియోకాంలు 5-10పౌన్లతో బరువు, ఖరీదులు తగ్గడంతో మా "విడియోశాస్త్రి" గారి గిరాకి తగ్గింది. ఎవరికివారే ఇంటికొక విడియోకెమెరా కొనడంతో మెల్లిగా జనం మావారి గొప్పతనం గురించి మర్చిపోయారు. ఆరోజులలో (ఈరోజులలోకూడా) ఎవరింటికి వెళ్ళినా వ్రతాలు, పండగలు మొదలుపెట్టేముందు, పళ్ళు, పువ్వులు, ప్రసాదాలతోపాటే ముక్కాళ్ళ స్టాండ్ మీద విడియో తగిలించి "రికార్డ్"లో గంటలకొద్దీ వదిలెయ్యడం మామూలయిపోయింది. మరి ఎంతమంది ఈ విడియోలని మళ్ళీమళ్ళీ చూస్తారో తెలీదు. చూస్తేమాత్రం శ్రీసత్యనారాయణవ్రత కథలో చెప్పినట్లుగా, పూజ చూసినా, కథ విన్నా పుణ్యం వచ్చి తీరుతుందని నా నమ్మకం.

కాలక్రమేణా అమ్మాయిల కాలేజి చదువుల ధాటి తగ్గాక, విదేశయాత్రలు, విహారయాత్రలు మొదలుపెట్టాము నేను, మావారు. మా పెద్దమ్మాయి అన్నట్టు నాన్నగారు ఒక కన్ను మూసుకొని, మరొక కన్నుతో చిన్న లెన్స్ లో ప్రకృతి సౌదర్యం అంతా చూడడం కన్నా, స్టిల్ కెమెరాతో తీసుకున్న ఫొటోలు ఎక్కువ సంతోషపరుస్తాయన్న మాటలో నిజం వుందనిపిస్తుంది. ఆమాట అంతగానచ్చని మావారు బరువైన విడియో కెమెరా ఎలాగో వదలి, తేలికైన కొత్త కెమెరాతో మా చైనా, రష్యా యాత్రలు మొదలయ్యాయి. అట్టే కళ్ళకు బాధ కల్పించకుండా స్క్రీన్ కూడా వుండడంతో ఎప్పుడూ కెమెరా వాడని నాక్కూడా వాడాలనే ఉత్సాహం వచ్చింది. ఎటొచ్చీ, మావారు తెలుసుకున్నదేమంటే, ఇంత ఉత్సాహంతో దేశ, విదేశాలు తిరిగి తీసిన విడియోలలో చూసిన సౌందర్యాన్ని అందరూచూసి సంతోషించాలనుకున్న మావారికి కొంత నిరాశ ఎదురయ్యింది. విడియో చూడటానికి సమయం లేదనో, ఇంట్రస్ట్ లేదనో, తర్వాత చూస్తామనో కొందరు దాటేశారు. పోనీలే, విడియో మొదలు పెట్టండన్న కొందరు రెండునిమిషాలు చూసిన తర్వాత ప్రక్కవాళ్ళతో ఖబుర్లలోకి దిగడంతో మావారిని చూస్తే జాలేసేది. చివరకి అసలు ఈ విడియోలు, ఫొటోలు తీసినవారి సంతోషం కోసమే కాని మరొకరి కోసం కాదని నిర్ధారణ కొచ్చామిద్దరము.

2000 సంవత్సరం మొదలయ్యాక వచ్చిన మార్పులందరికీ తెలిసినవే. టెక్నాలజీ పేరుతో కొత్త పరికరాలు వచ్చాయి. విడియో ప్రపంచంలో హేండీ కాం, పాం కాంలాంటి కనిపించీ కనిపించనంత చిన్న కెమెరాలు ఉపయోగిస్తూ, కన్నుమూసి తెరిచేలోగా టి.వి.ల్లోను, కంప్యూటర్లలోను (యూ-ట్యూబ్)ల్లోను, మనం అనుకున్న విడియోలను ఒకరితో నొకరు పంచుకుంటున్నాము. వెబ్‌కాం, స్కయిప్, వాటిద్వారా ఎన్నివేల మైళ్ళ దూరంలో ఉన్నా ఎదురుగా మాట్లాడగలుగుతున్నాం. ఈమధ్య పెళ్ళిళ్ళు, ఒడుగులు, గృహప్రవేశాలు కూడా ఇండియా వెళ్ళకుండానే, ముహూర్త సమయానికి కంప్యూటర్ ముందు కూర్చొని, ప్లేను ఖర్చు, శలవల ఖర్చు లేకుండాపాల్గొంటున్నాము. కానీ పెళ్ళికెళ్ళినా వెళ్ళకపోయినా కెమెరాముందు కూర్చుంటున్నారు జాగ్రత్త, ముఖ్యంగా - ఆడవాళ్ళూ! మీరు పెళ్ళికి వెళ్ళకపోయినా వెబ్‌కాం లో ఇండియాలో పెళ్ళికొచ్చిన వారంతా మిమ్మల్ని చూస్తారు సుమా! వెబ్‌కాం మొదలుపెట్టే సమయానికి కొలోన్ అవసరంలేదుకానీ, మంచి పట్టుచీర, మాచింగ్ నగలు వేసుకోవడం మాత్రం మరచిపోకండి సుమా!! ఎన్ని మార్పులు వచ్చాయో, ఇంకేన్ని మార్పులు వస్తాయో మరి! మీరేమంటారు?